క్లుప్తంగా

కార్పొరేషన్ స్కూళ్లకు హెచ్ఎం, ఎస్ఏ పోస్టులు మంజూరు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలోని స్వర్ణాంధ్రనగర్, భారత్ పేట, గుజ్జనగుండ్ల, వెంగళరావునగర్, కేవీపీ కాలనీలోని అప్‌గ్రేడ్ అయిన హైస్కూళ్లకు హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయాలని యూటీఎఫ్ గుంటూరు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చిన్నయ్య, కె.ప్రభూజీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు చదువుతున్న విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షల అనంతరం కళాశాలలకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో సబ్జెక్టు టీచర్లతో పాటు హెచ్ఎం పోస్టులు లేక ఎస్జీటీలతోనే బోధన, పరిపాలన విధులను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఉన్నత పాఠశాలలకు అవసరమైన సబ్జెక్టు టీచర్ పోస్టులను మంజూరు చేయకుండా కేవలం ఎస్జీటీలతోనే నడపడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలలకు అవసరమైన పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

జీజీహెచ్ ఉద్యోగి మృతి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో ఎంఎన్ఓగా పనిచేస్తున్న జి.అచ్చయ్య(52) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ఆదివారం ఆస్పత్రి సిబ్బందితో కలిసి వెళ్లి అచ్చయ్య కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 30 ఏళ్ల పాటు రోగులకు సేవలు అందించిన అచ్చయ్య మృతి తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజల నుంచి తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ఇతర సమస్యలపై సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో అర్జీలు (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) స్వీకరిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, డెప్యూటీ కమిషనర్లు, అధికారులు పాల్గొంటారన్నారు. నగరప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

వైఖానస పండితులకు నివాళి



తెనాలి రూరల్: ఇటీవల మృతి చెందిన సీనియర్ పాత్రికేయులు, వైఖానస ఆగమ పండితులు ఆర్ఎస్ గోపాలకృష్ణ, వైకుంఠపురం దేవస్థానం పాకయాజి రత్నాకరం రంగనాథాచార్యులుకు నివాళులు అర్పించారు. వారి సంస్మరణ కార్యక్రమాన్ని స్థానిక వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. వైఖానస సేవా సంఘం అధ్యక్షుడు మేడూరి శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాత్రికేయ రంగంలోనే కాకుండా సంస్కృత, తెలుగు భాషలతోపాటు వైఖానస ఆగమంలో కూడా ప్రావీణ్యాన్ని పొంది సమాజానికి సేవలందించిన మహా వ్యక్తి గోపాలకృష్ణ అని కొనియాడారు. వైకుంఠపురం దేవస్థానంలో పాకయాజిగా పనిచేస్తూ వైఖానస, అర్చక సంఘాలకు రంగనాథాచార్యులు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎస్. వేణుగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తమిరిశ రఘు, ప్రధాన కార్యదర్శి మాధవ కుమార్, కోశాధికారి దివి యోగానంద చక్రవర్తి, డాక్టర్ ధన్వంతరి వేదాంతం శర్మ, తమిరిశ హరిబాబు, అంజనీ కుమార్, పి. రామ గోపాల్ నాగ మారుతి తదితర వైఖానస ప్రముఖులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ నూతన అధ్యక్షుడిగా ఆదిశేషు

నగరంపాలెం: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ నూతన అధ్యక్షుడిగా పరిశే ఆదిశేషు, కార్యదర్శిగా భీమినేని సుధీర్‌బాబు, కోశాధికారిగా రవిలిశెట్టి పద్మజ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం రాత్రి తాలుకా పెన్షనర్స్ హాల్‌లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో రోటరీ జిల్లా పూర్వ గవర్నర్ పి.శివన్నారాయణ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీ ద్వారా సమాజ సేవ చేయాలని పూర్వ గవర్నర్ శివన్నారాయణ అన్నారు. అనంతరం నూతన కార్యవర్గం మాట్లాడారు. రోటరీ డెప్యూటీ గవర్నర్ శివ రంజని, సహాయ గవర్నర్ కొల్లా శ్రీనివాస రావు, వైఏ చౌదరి, కేఎల్ రావు, బి.చెన్నయ్య, వి.సతీష్‌బాబు, పి.సుబ్బారావు, మద్ది రాధాకృష్ణ పాల్గొన్నారు. తొలుత కొరిటిపాడు పార్క్‌లో మొక్కలు నాటారు. నెహ్రూనగర్‌లోని గోశాలలో గోవులకు రూ.30 వేలతో పశుగ్రాసం అందించారు.

విద్య ద్వారానే విశ్వబ్రాహ్మణుల సంక్షేమం

ప్రొఫెసర్ కందేపి సురేంద్రనాథ్



విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోట్సులు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్య ద్వారానే విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి సాధ్యమని విశ్రాంత అధ్యాపకుడు ఆచార్య కందేపి సురేంద్రనాథ్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో విశ్వకర్మ పేద విద్యార్థి సంక్షేమ సంఘ 27వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. సురేంద్రనాథ్ మాట్లాడుతూ సృష్టికర్త విశ్వకర్మ వారసులుగా మానవ నాగరిక సమాజానికి కావాల్సిన అన్ని రకాల పనిముట్లను అందించిన విశ్వబ్రాహ్మణులు ఆధునిక సమాజంలో మనుగడ సాధించాలంటే పండిత గానాల రామమూర్తి స్ఫూర్తితో విద్యావంతులుగా ఎదగడం తప్పనిసరి అని అన్నారు. ఈసందర్భంగా నగరంలోని దయా హృదయ సేవా సమితి అధ్యక్షుడు అమృతలూరి వీరబ్రహ్మేంద్రరావు, స్వర్ణ శిల్పి శంభాన వీరభద్రాచారి, లఘు చిత్రాల నిర్మాత, దర్శకుడు గన్నే వాసుదేవరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు సీహెచ్ వెంకట వసంతరావును సన్మానించారు. అనంతరం పాఠశాల, కళాశాలస్థాయి విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు, ఇతర విద్యా ఉపకరణాలు అందజేశారు. సంక్షేమ సంఘ వ్యవస్థాపకుడు గోనుగుంట్ల శేషగిరిరావు మాట్లాడుతూ గత 27 ఏళ్లుగా దాతల సహకారంతో నగరంలోని పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. సంక్షేమ సంఘ అధ్యక్షుడు పట్నాల శివ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దుగ్గిరాల సబ్ రిజిస్ట్రార్ అద్దంకి నవకుమార్, సంఘ కార్యదర్శి కటేవరపు కృష్ణారావు, కోశాధికారి చిర్రావూరి సుధీర్ బాబు, ఇంజనీర్ కందేపి వెంకటరావు, కందుకూరి లక్ష్మీ నారాయణ, అంగలకుదుటి సుశీల, ఇంజనీర్ కందేపి వెంకటరావు, మేడూరి శివరామకృష్ణ పాల్గొన్నారు.

సాంస్కృతిక రంగానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి
జంగాల అజయ్ కుమార్



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

లక్ష్మీపురం: గ్రామీణ జానపద పౌరాణిక నాటక రంగ కళాకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అలాగే దేశ వ్యాపితంగా పేదలకు ప్రజలకు ఇబ్బంది కలిగించే అన్యాయమైన నూతనంగా తీసుకొచ్చిన స్వదేశీ క్రిమినల్ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి బాధ్యులు జంగాల అజయ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి సంఘ నాయకులు మహేంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో మోదీ మతోన్మాద చర్యలను విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది కళాకారులు వీధిన పడకుండా గ్రామీణ జానపద పౌరాణిక ఔత్సాహిక కళాకారులందరికి సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ప్రభుత్వం చొరవ చూపెట్టి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. నేటి ప్రపంచం కళల ద్వారానే అన్ని సమాజాలు మార్పు చెందాయన్నారు. సమాజ మార్పు కోసం చైతన్యం కోసం పాటుపడుతున్న ప్రజా కళాకారుల పట్ల ప్రభుత్వాలు చిన్నచూపు చూడకుండా ప్రజా కళలను బతికించు కోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కళాకారులు అందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు, ఇంటి స్థలాలు, ఉచిత బస్సు పాసులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్టా జాతీయ కార్యదర్శి గని మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం గుంటూరు నగర కార్యదర్శి పున్నయ్య, రచయిత దేవరకొండ శ్రీనివాసులు, కళాకారులు జంపరి గోవిందరాజు, గంటా రాజేంద్ర రాజబాబు, చిట్టిబాబు, రమణ ఒంగోలు రాంబాబు పాల్గొన్నారు.

బీకాం జనరల్ కోర్సు కొనసాగించాలి

- తక్షణమే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి స్పందించాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాసర్ జీ



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాసర్ జీ

లక్ష్మీపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సు ఎత్తివేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాసర్ జీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్స్ తొలగించి, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో కొనసాగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీని వలన విద్యార్థులు నష్టపోతారని ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులు లేక మూతపడుతున్నటువంటి పరిస్థితి ఆంధ్ర ప్రదేశ్‌లో నెలకొందని తెలిపారు. తక్షణమే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కూడా బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలని కోరారు. ఈనెల 10వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతున్న సందర్భంగా త్వరగతిన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బీకాం జనరల్ కోర్సు ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్ , దేవేంద్ర, రాహుల్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి

డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు



మాట్లాడుతున్న డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, వేదికపై డాక్టర్ జొన్నలగడ్డ యాసిన్ తదితరులు

గుంటూరు మెడికల్: నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఐఏఎస్ అధికారి డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు కొనియాడారు. ఆదివారం గుంటూరు పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో నేస్తం స్వచ్ఛంద సేవాసంస్థ మొదటి వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎక్కువమంది శ్రేయోభిలాషులు ఎవరికి ఉంటారో వారే అసలైన ధనవంతులన్నారు. సమాజంలో బాగుంటేనే మనం బాగుంటామని హితవు పలికారు. విశిష్ట అతిథిగా హాజరైన కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఇ.వి.నారాయణ మాట్లాడుతూ మనం మంచిని మాత్రమే గ్రహించాలని, సమాజంలో మనం ప్రతి ఒక్కరికి రుణపడి ఉన్నామనే భావనతో సేవ చేయాలన్నారు. డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్, డాక్టర్ రేవూరి హరికృష్ణ, జి.సాయికృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలో తాము భాగస్వామ్యం కావడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సేవాసంస్థ వ్యవస్థాపకుడు జలీల్ అహ్మద్ మాట్లాడుతూ గత ఏడాది కాలంలో నేస్తం ఆధ్వర్యంలో వందకు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో దాతల ఆర్థిక సాయం, సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. సంస్థ సహ వ్యవస్థాపకుడు టి.ధనుంజయరెడ్డి మాట్లాడుతూ కష్టాన్ని గుర్తించే నేత్రం, కన్నీటిని తుడిచే హస్తం మా నేస్తం అన్నారు. గుంటూరు నగరంలో పిల్లలకు, వృద్ధులకు నిస్వార్థంగా సేవలందిస్తున్న అనాథాశ్రమ, వృద్ధాశ్రమ నిర్వాహకులను అతిథుల చేతుల మీదగా సత్కరించారు. వేదుకలో సంస్థ సభ్యులు త్రిపుర సుందర రావు, కె.రమణ, కె.సత్యనారాయణ, షరీఫ్, సుబ్రహ్మణ్యం, ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్, గోపాల్, చంద్రశేఖర్ రెడ్డి, కన్నా రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ స్వామి రథయాత్ర





బాలభద్ర సుభద్ర జగన్నాథ స్వామి

నగరంపాలెం: ఒడిశా రాష్ట్రం పూరిలోని జగన్నాథ స్వామి రథయాత్ర పురస్కరించుకుని గుంటూరు కొత్తపేట(పశువుల ఆసుపత్రి ఎదురు)లోని జగన్నాథ స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి బాలభద్ర సుభద్ర జగన్నాథ స్వామి వారి రథయాత్ర నిర్వహించారు. ఈ క్రమంలో నగర పుర వీధుల్లో రథయాత్ర కొనసాగింది. బారులు తీరిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. జగన్నాథ, ఆంజనేయ, వేంకటేశ్వర స్వామి వార్ల దేవస్థానం సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, గుంటూరు నగరంలోని ఒడిశా రాష్ట్రానికి చెందిన భక్తులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు ఇస్లావత్ గాంధీనాయక్, దమ్మలపాటి విజయనిర్మల, ఉడత మహేష్‌కుమార్, రాంబాబు, సూరిబోయిన వెంకటరావు, సుజన, వనజ, లక్ష్మీ, దేవస్థానం అర్చకులు అయోధ్య అయ్యప్ప, దేవస్థానం సిబ్బంది వేణు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆశాజ్యోతి 'వెన్నెలకంటి'



నెహ్రూనగర్: గిరిజనుల ఆశాజ్యోతి వెన్నెలకంటి రాఘవయ్య అని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. ఎస్టీ, యానాది డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల ఏసుబాబు ఆధ్వర్యంలో ఆదివారం నాజ్‌సెంటర్‌లో రాఘవయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులుగా, గిరిజనుల అభ్యున్నతికి రాఘవయ్య ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఏసుబాబు మాట్లాడుతూ దాతల సహకారంతో గిరిజనులకు వసతి గృహాలు, నివాసయోగ్యాలు ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. క్రిమినల్స్ ట్రైబల్ యాక్ట్ రద్దు చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. స్థానిక కార్పొరేటర్ సమత, బీసీ నాయకులు అంగిరేకుల వరప్రసాద్, ఏడుకొండలు, కృష్ణానాయక్, సైదులు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గుంటూరు ఈస్ట్: రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఆదివారం రెడ్డిపాలేనికి చెందిన ఏడుకొండలు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు షాప్ ఎంప్లాయిస్ కాలనీలో దాడిచేసి ఏడుకొండలును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటేనే ఇసుక



కొల్లిపర: ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విధానంలో లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డు ద్వారా నమోదు చేసుకుంటేనే స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లోడ్ చేయాలని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ ఆదేశించారు. రాష్ట్రంలో సోమవారం ఉచిత ఇసుక విధానం ప్రారంభం సందర్భంగా ఆదివారం సబ్ కలెక్టర్ కొల్లిపర, మున్నంగిలోని ఇసుక స్టాక్ పాయింట్‌లను తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులు సమన్వయంతో ఉచిత ఇసుక విధానాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ఇసుక కావాల్సినవారు బుకింగ్, చెల్లింపులు అంతా ఆన్‌లైన్‌లో చేయాల్సి ఉంటుందన్నారు. స్టాక్ పాయింట్ వద్ద ఎవరూ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఒక వ్యక్తి ఆధార్ కార్డుపై రోజుకు 20 టన్నులు మాత్రమే ఇసుక ఇవ్వనున్నట్లు తెలిపారు. కొల్లిపర స్టాక్ పాయింట్‌లో 33 వేల టన్నులు, మున్నంగిలో 1. 81 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. స్టాక్ పాయింట్ వద్ద పోలీసులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారుల వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రవీంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు (సాయి), వీఆర్‌వోలు భాస్కర్, భాను, రామారావు, మండల సర్వేయర్ వరప్రసాద్ ఉన్నారు.

అలరించిన భక్తి గీతాలపన



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళ్యాణ వేదికపై భక్తిమాల గ్రంథమాలికలోని గీతాలాపన గానం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఇమ్మడి అంజనీదేవి బృందం ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. యిమ్మడి అంజనీదేవి బృందం శ్రీగణేశ గీతంతో ప్రారంభించి, శ్రీ సూర్యనారాయణ, పిలుపులో పిలిచితే, వెలసినావు తిరుమలలో, ఎందుకయ్య సాంబశివా, పాహిమాం శ్రీరామ పలు భక్తిగీతాలను ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. కీబోర్డుపై సాయి, తబలపై వెంకట్ వాయిద్యా సహకారం అందించారు.

కూటమి హామీలను నెరవేర్చాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

లక్ష్మీపురం: రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. స్థానిక బ్రాడీపేటలోని మైనేని భవన్‌లో సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభించారు. ప్రారంభ సమావేశానికి ఈమని అప్పారావు అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించి త్వరితగతిన పనులు ప్రారంభించాలని కోరారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు కౌలు చెల్లించాలని, కౌలు చెల్లించే కాలపరిమితిని పెంచాలని విజ్ఞప్తి చేశారు. రాజధాని సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణంలో భూములు సేకరించే రైతులకు ప్యాకేజీని పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వ్యవసాయ సీజన్ న్ ప్రారంభమైందని, కాని ఇంత వరకు కొండవీటి వాగు, గుంటూరు ఛానల్, మేకల వాగు, నల్లమడ వాగు ఇతర పంట కాల్వల్లో తూటుకాడ తీత పనులు పనులు చేపట్టాలని ఆందోళన వ్యక్తం చేశారు. తూటికాడ తొలగించి నీటి పారుదలకు అవకాశం కల్పించాలని కోరారు. ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్.రఘు మాట్లాడుతూ కేంద్రంలో బి.జె.పి. మూడవ సారి అధికారంలోకి వచ్చాక దేశంలో అనేక ప్రాంతాలలో మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని చెప్పారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన క్రిమినల్ చట్టాలలో మార్పులు చేసి ప్రజా ఉద్యమాలను, ఉద్యమ కారులను అణిచే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా జియో రీఛార్జ్ రేట్లు పెంచుకునేందుకు అనుమతి నిచ్చి ప్రజలను దోపిడీ చేస్తున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించాలని, ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్న పేదలకు జిల్లా వ్యాపితంగా ఇళ్ల పట్టాలివ్వాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు వై.నేతాజీ, కె.నళినీకాంత్, ఎస్.ఎస్.చెంగయ్య, ఎం.రవి, బూరుగ వెంకటేశ్వర్లు, డి.వెంకటరెడ్డి, ఎల్.అరుణ, బి.కోటేశ్వరి, సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, జె.వి.రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



సంజీవయ్యనగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నెహ్రూనగర్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ 53వ డివిజన్ అధ్యక్షులు అదిపోగు గోపి ఆధ్వర్యంలో సంజీవయ్యనగర్ సెంటర్‌లో కేక్‌ను కట్ చేసి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వేమురు సుధీర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా 30 సంవత్సరాల క్రితం మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభమైందని, త్వరలో ఎస్సీ వర్గీకరణ జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కూచిపూడి సత్యం, చలివేంద్రం వెంకటేశ్వర్లు, కొమ్మూరి జాన్సన్, మందా ప్రేమనందం, దావులూరి కుమార్, రాజు, తానాచింతల చంటి, పూనూరి వెంకటేష్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం ఇజ్రాయేల్‌పేటలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సుబ్బయ్య, మక్కెన ప్రభాకర్, ప్రసాద్, రమణ, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సృజన్‌కుమార్



మాట్లాడుతున్న జనరల్ ఫిజిషియన్ డాక్టర్ సృజన్‌కుమార్

లక్ష్మీపురం: సీనియర్ సిటిజన్స్ ఆరోగ్య సమస్యలు ఉంటే విధిగా, వైద్యుని సంప్రదిస్తూ వారి సలహా సూచనలు మేరకు జాగ్రత్తలు పాటించాలని జనరల్ ఫిజిషియన్ డాక్టర్ సృజన్ కుమార్ కోరారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా పెద్ద వయసులవారు ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెద్ద వయసు వారు బరువులెత్తి వ్యాయామం చేయకపోయినా వాకింగ్ ,సైక్లింగ్ లాంటి వ్యాయామాలు చేస్తూ ఉంటే వారి ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. వ్యాయామాలు చేసినప్పుడు తక్కువ బరువు తో వ్యాయామాలు చేయాలని సూచించారు. అనంతరం డాక్టర్ సృజన్ కుమార్ ను ఘనంగా సంస్థ సభ్యులు సత్కరించారు.

చేతిరాతను అందంగా మలచుకుంటే ప్రగతి

ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి



చేతిరాత నైపుణ్యంలో శిక్షణ పొందుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి, పక్కన రామమోహనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: చేతిరాతను అందంగా మలచుకుని జీవితంలో ప్రగతి సాధించవచ్చని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. స్తంభాల గరువులోని చేబ్రోలు మహాలక్ష్మి- పుల్లయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఆదివారం క్యాలీగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తూ, క్యాలీగ్రఫీ ఫ్యామిలీగా ఏర్పడిన ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చుతో తోటి ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ కల్పించడం ద్వారా విద్యార్థుల చేతిరాతను అందంగా తీర్చిదిద్దుతున్న తీరును మెచ్చుకున్నారు. ఈసందర్భంగా చేతిరాత నైపుణ్య శిక్షణ శిబిరానికి ఉపాధ్యాయులతో పాటు అభ్యాసకునిగా హాజరైన ఆయన ఉదయం నుంచి సాయంత్రం వరకు అభ్యాసకునిగా కూర్చుని తన చేతిరాతను మార్చుకున్నారు. కార్యక్రమంలో చేతిరాత శిక్షణ నిర్వాహకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు, పెదకాకాని ఎంఈఓ శంకర్‌రాజు, కల్లగుంట్ల, పిడుగురాళ్ల జెడ్పీ హైస్కూళ్ల హెచ్ఎంలు ప్రసాద్, ధనలక్ష్మి, రిసోర్సు పర్సన్లుగా వ్యవహరించిన టి. శ్రీనివాసరావు, ఇ.అనిల్‌కుమార్, ప్రసాద్, షాజీర్, నాగలక్ష్మి, సత్యనారాయణ, శారద, రమాదేవి, పుష్ప పాల్గొన్నారు.

'రఫీ' పాటలతో అభిమానుల పరవశం

తెనాలి: కళావేదికపై మహాగాయకుడు రఫీ ఆలపించిన పాటలు నేటి గాయకుల గళంలోంచి వెలువడి అలల తరగపై పరవళ్లు తొక్కాయి. ఆడిటోరియంలో కిక్కిరిసిన ప్రేక్షకుల హృదయాన్ని పరవశింపజేశాయి. హిందీ సినీ వినీలాకాశంలో తారగా విలసిల్లిన మధురగాయకుడు రఫీ. ఒకప్పుడు ఆయన గొంతులోంచి జాలువారిన మధురమైన పాటలు ఇప్పటికీ పాటల ప్రేమికులను అలరిస్తూనే ఉన్నాయి. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి జరిగిన సంగీత కచేరీ ఇందుకో నిదర్శనం. పట్టణ సంగీత సంస్థ 'సంకీర్తన' ఆధ్వర్యంలో 'సుహానీ షామ్', 'రఫీ సాబ్‌కే యాద్‌మే' పేరుతో 7వ వార్షిక సంగీత కచేరీని ఆసాంతం ప్రేక్షకులు ఆస్వాదించారు. రఫీ గానం చేసిన హిందీ, తెలుగు సినిమాల్లోని పాటలను గాయనీగాయకులు ఆలపించారు. సంకీర్తన సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు సభానిర్వహణ చేస్తూనే.. రఫీ పాటలతో కరతాళధ్వనులను అందుకున్నారు. వీరితోపాటు గాయనీగాయకులు షేక్ బి.సైదా (తెనాలి), పీఎల్ అలీఖాన్ (పొన్నూరు), షేక్ ఖాజా షానవాజ్ (హైదరాబాద్), శారదా రాజా (హైదరాబాద్), ఎం.మల్లిక (తెనాలి), కె.రాజేశ్వరరావు రాత్రి 9 గంటల వరకు ప్రేక్షకులను అలరించారు. ఇజ్జత్ సినిమాలో అతి క్లిష్టమైన పహాడ్ రాగంలో రఫీ గానం చేసిన 'ఏ దిల్ తుమ్ బిన్' గీతాన్ని డాక్టర్ పురుషోత్తమరావు చక్కగా గానం చేసి ప్రశంసలు అందుకున్నారు.